మరిన్ని ట్యాంకర్లు సమకూర్చుతాం

12 గంటల్లోపే ట్యాంకర్ డెలివరీ చేస్తాం

ప్రత్యేక చర్యలతో సగానికి పైగా ఫిల్లింగ్ స్టేషన్లలో 24 గంటల్లోపే ఇస్తున్నాం
మార్చితో పోలిస్తే పెరిగిన ట్యాంకర్లు, ఫిల్లింగ్ స్టేషన్లు, పాయింట్స్
నీటి సరఫరాలో ఉద్దేశపూర్వక ఆటంకాలు కలిగిస్తే కఠిన చర్యలే..

సమీక్షలో ఎండీ సుదర్శన్ రెడ్డి

సిటీబ్యూరో, ఏప్రిల్ 23(నమస్తే తెలంగాణ): జలమండలి తీసుకున్న ప్రత్యేక చర్యలతో గ్రేటర్‌లోని సగానికి పైగా ఫిల్లింగ్ స్టేషన్లలో 24 గంటల్లోపే ట్యాంకర్ డెలివరీ చేస్తున్నామని ఎండీ సుదర్శన్ రెడ్డి చెప్పారు. తొందరలోనే ట్యాంకర్ డెలివరీ సమయాన్ని 12గంటలకు తగ్గించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఖైరతాబాద్ సంస్థ ప్రధాన కార్యాలయంలో మంగళవారం డైరెక్టర్లు, సీజీఎం, జీఎం, డీజీఎంలతో కలిసి వేసవి కార్యాచరణ, ట్యాంకర్ మేనేజ్‌మెంట్‌పై ఎండీ సుదర్శన్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. క్షేత్రస్థాయిలో నీటి సరఫరా, ట్యాంకర్ బుకింగ్స్, డెలివరీ టైమ్ తదితర వివరాల్ని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ట్యాంకర్ బుకింగ్స్ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో సాధ్యమైనంత త్వరగా డెలివరీ చేయాలన్నారు. మార్చి నెలతో పోలిస్తే కొత్త ట్యాంకర్లు, ఫిల్లింగ్ స్టేషన్లు, ఫిల్లింగ్ పాయింట్స్ ఏర్పాటు చేశామన్నారు. రాత్రి వేళల్లో ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా చేయడంతో పెండెన్సీ బాగా తగ్గించుకున్నామని ఎండీ చెప్పారు. ఇలాగే, ప్రత్యేక దృష్టి పెడితే బుక్ చేసిన 12 గంటల్లోపే ట్యాంకర్ డెలివరీ చేసే వీలవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ట్యాంకర్ బుకింగ్, డెలివరీ సరళిని పరిశీలిస్తే..

వివరాలు	మార్చి 31 నాటికి	ఏప్రిల్ 22 నాటికి
మొత్తం ట్యాంకర్లు	613	816
ఫిల్లింగ్ స్టేషన్లు	70	86
ఫిల్లింగ్ పాయింట్స్	108	151
రోజువారీ బుకింగ్స్	4945	6064
రోజువారీ డెలివరీ	6579	8390
సరఫరా చేసిన ట్రిప్పులు	1,68,996	1,67,134

మార్చిలో 1,68,996 ట్రిప్పుల డెలివరీ

మార్చి నెలలో మొత్తం 1,68,996 ట్యాంకర్ ట్రిప్పులను డెలివరీ చేశామని ఎండీ వివరించారు. ఈ నెలలో 22వ తేదీ నాటికి 1,67,134 ట్రిప్పులు సరఫరా చేసినట్లు వెల్లడించారు. కాగా, మార్చి 31 నాటికి 613 ట్యాంకర్లు ఉండగా.., ప్రస్తుతం 816 వరకు పెంచుకున్నట్లు చెప్పారు. మరిన్ని ట్యాంకర్లు సమకూర్చుకుంటామని ఎండీ తెలిపారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని ఎంసీసీకి ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ప్రధానంగా మంచినీటి సరఫరాకు సంబంధించిన సమస్యలు, కలుషిత నీరు సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఎండీ ఆదేశించారు. మురుగునీటి నిర్వహణపై దృష్టి సారించాలని చెప్పారు. నీటి సరఫరాలో ఉద్దేశపూర్వకంగా ఆటంకాలు కలగజేస్తే, ఎలాంటి వారైనా సహించేది లేదని హెచ్చరించారు. ట్యాంకర్ల మళ్లింపు విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. ఈ సమీక్షలో డైరెక్టర్లు అజ్మీరా కృష్ణ, వీఎల్ ప్రవీణ్ కుమార్, స్వామి, రవి కుమార్ పాల్గొన్నారు.

బాలభవన్‌లో 25 నుంచి వేసవి శిక్షణ శిబిరం

తెలుగు యూనివర్సిటీ, ఏప్రిల్ 23: నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్ ప్రాంగణంలోని జవహర్ బాలభవన్ ఈ నెల 25 నుంచి మే 31వరకు బాలబాలికలలో దాగి ఉన్న సృజనాత్మక ప్రతిభను వెలికితీసి ప్రోత్సహించాలనే లక్ష్యంతో వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు బాల భవన్ డైరెక్టర్ ఎస్.విజయలక్ష్మి మంగళవారం తెలిపారు. భరతనాట్యం, చిత్రలేఖనం, క్రాఫ్ట్స్, జానపద నృత్యం, సంగీతం, సైన్స్, స్కేటింగ్, సాహిత్యం, స్టెమ్ సైన్స్, లైబ్రరీ అంశాలలో బాలభవన్ ప్రాంగణంలో శిక్షణ కొనసాగుతుందని, అనంతరం, సర్టిఫికెట్లను ప్రదానం చేస్తామన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నం: 040-2323 3956లో సంప్రదించి పేరు నమోదు చేసుకోవాలని సూచించారు.

సందడిగా నామినేషన్ల ప్రక్రియ

రేపటితో ముగింపు - మరింత హీటెక్కనున్న అభ్యర్థుల ప్రచారం

సిటీబ్యూరో, ఏప్రిల్ 23(నమస్తే తెలంగాణ): పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల ప్రక్రియ సందడి వాతావరణంలో జరుగుతున్నది. కాగా, గత గురువారం నుంచి మొదలైన నామినేషన్ దాఖలు ప్రక్రియ ఈ నెల 25 వరకు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల సమయం వరకు నామినేషన్ల స్వీకరణ జరగనుంది. ఇప్పటికే ప్రధాన పార్టీల అభ్యర్థులు నామినేషన్ వేసి ప్రచారంలో స్పీడ్ పెంచారు. తుది దశకు చేరిన నామినేషన్ ప్రక్రియలో భాగంగా మంగళవారం సికింద్రాబాద్ లోక్‌సభ స్థానం నుంచి 11 నామినేషన్లు, హైదరాబాద్ నుంచి 11 నామినేషన్లు, కంటోన్మెంట్ అసెంబ్లీ స్థానానికి ముగ్గురు అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేశారు.

రేపట్నుంచి ఓపెన్ స్కూల్ పరీక్షలు

హైదరాబాద్ డీఈఓ రోహిణీ

సిటీబ్యూరో, ఏప్రిల్ 23(నమస్తే తెలంగాణ): రేపటి నుంచి తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఎస్సెస్సీ, ఇంటర్ పరీక్షలు జరుగుతాయని హైదరాబాద్ డీఈఓ రోహిణి తెలిపారు. మే 2 వరకు పరీక్షలు ఉంటాయని చెప్పారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు పరీక్ష సమయాలని పేర్కొన్నారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు నిర్ణీత సమయంలోనే కేంద్రాలకు చేరుకోవాలని వివరించారు.

భజే వాయుపుత్రం..

తాడుబండు వీరాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు

'జై బజరంగ్ భలి.. పవన పుత్ర హనుమాన్‌కీ జై' అన్న నినాదాలు నగరంలో పలుచోట్ల మార్మోగాయి. రామ భక్త హనుమాన్‌ను కీర్తిస్తూ భక్తి గీతాలు వినిపించాయి. వేల సంఖ్యలో బైకులపై ర్యాలీలు తీస్తూ యువత, రెపరెపలాడిన కాషాయ జెండాలతో మంగళవారం నగరంలో హనుమాన్ జయంత్యుత్సవం వైభవంగా సాగింది. తెల్లవారుజాము నుంచే దేవాలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. నగరంలోని కర్మాన్‌ఘాట్, ఆర్టీసీ క్రాస్ రోడ్డు, నామాల గుండు, అబిడ్స్, బేగంపేట్, హైటెక్ సిటీ, వనస్థలిపురం తదితర ప్రాంతాల్లో హనుమాన్ జయంత్యుత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. వాహనాలకు హనుమాన్ జెండాలను అమర్చి కాలనీల్లో సందడి చేశారు. ఆలయ సమీపంలో వేదికలు ఏర్పాటు చేసి హనుమాన్ కీర్తనలు వినిపించారు. శోభయాత్రను వీక్షించేందుకు భక్తులు పోటీపడ్డారు.

– సిటీబ్యూరో, ఏప్రిల్ 23(నమస్తే తెలంగాణ);

కోర్టు ఆవరణలో నిందితులకు సంకెళ్లా.?

కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్రానికి హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, ఏప్రిల్ 23 (నమస్తే తెలంగాణ): రంగారెడ్డి జిల్లా కూకట్‌పల్లి జిల్లా కోర్టు ఆవరణలోకి కూడా నిందితులకు పోలీసులు సంకెళ్లు వేసి తీసుకురావడాన్ని తప్పుపట్టిన హైకోర్టు.. రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. ముగ్గురు నిందితులకు సంకెళ్లు వేసి కూకట్‌పల్లి కోర్టులో హాజరుపర్చేందుకు పోలీసులు తీసుకువచ్చారని ఓ సీనియర్ న్యాయవాది హైకోర్టుకు లేఖ రాశారు. దీనిని ప్రజాప్రయోజన వ్యాజ్యంగా పరిగణించిన న్యాయస్థానం మంగళవారం విచారణ చేపట్టింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరథే, జస్టిస్ జె.అనిల్ కుమార్‌లతో కూడిన ధర్మాసనం ప్రభుత్వానికి నోటీసులు ఇచ్చింది. ప్రతివాదులైన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, న్యాయశాఖ కార్యదర్శి, హోంశాఖ ముఖ్యకార్యదర్శి, డీజీపీ, హైదరాబాద్, సైబరాబాద్ పోలీసు కమిషనర్‌లకు నోటీసులు జారీ చేసింది. ఇలాంటి ఘటనలు జరగకుండా ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. విచారణను వాయిదా వేసింది. ప్రేమ్ శంకర్ శుక్లా వర్సెస్ ఢిల్లీ కేసులో సుప్రీం కోర్టు జారీ చేసిన మార్గదర్శకాలకు వ్యతిరేకంగా పోలీసులు చేశారని లేఖలో పేర్కొన్నారు. శాంతి భద్రతల పరిరక్షణతోపాటు మానవ హక్కుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరారు. మానవ హక్కుల ఉలంఘన జరగకుండా చర్యలు తీసుకునేలా పోలీసులకు ఉత్తర్వులు ఇవ్వాలన్నారు.

వీఐటీ - ఏపీ వర్సిటీకి ఎడ్యుకేషన్ ఎక్స్‌లెన్స్ అవార్డు

జూబ్లీహిల్స్, ఏప్రిల్ 23: వెల్లూర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (వీఐటీ - ఏపీ) విశ్వవిద్యాలయానికి 2024 సంవత్సరానికి గాను సీఎస్సార్ అవుట్ స్టాండింగ్ యూనివర్సిటీ ఇన్ ఎడ్యుకేషన్ ఎక్స్‌లెన్స్ అవార్డు దక్కింది. ఈ మేరకు మంగళవారం ఢిల్లీలో నిర్వహించిన ఒక కార్యక్రమంలో కాంపిటీషన్ సక్సెస్ రివ్యూ (సీఎస్ఆర్) చైర్మన్ అండ్ ఎడిటర్ సురేంద్ర కుమార్ సచ్‌దేవ చేతుల మీదుగా వీఐటీ-ఏపీ వీసీ డాక్టర్ ఎస్వీ కోటారెడ్డి అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా కోటారెడ్డి మాట్లాడుతూ ఈ సీఎస్ఆర్ యూనివర్సిటీ ఇన్ ఎడ్యుకేషన్ అవార్డుతో అరుదైన గౌరవాన్ని అందుకున్నదన్నారు. దేశంలో 60 ఏండ్లకు పైగా నాణ్యమైన విద్య, నైపుణ్యాలతో నైతిక విలువలకు కట్టుబడి అందిస్తున్న సేవలకు ఎక్స్‌లెన్స్ అవార్డు అందుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ జగదీష్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్ డిస్కవరీలపై సీసీఎంబీ అధ్యయనం

సమర్థవంతంగా పనిచేసే ఔషధాలకు ప్రాధాన్యత

సిటీబ్యూరో, ఏప్రిల్ 23(నమస్తే తెలంగాణ): పెరుగుతున్న రోగాలు, తగ్గుతున్న వ్యాధి నిరోధకత కారణంగా మొండి వ్యాధులపై సమర్థవంతంగా పనిచేసే ఔషధాలకు ప్రాధాన్యత పెరిగింది. ఈ క్రమంలో రోగ కారకాలపై నేరుగా పనిచేసే డ్రగ్ డిస్కవరీపై సెంటర్ ఫర్ సెల్యూలర్ అండ్ మాలిక్యూలర్ బయాలజీ పరిశోధకులు దృష్టి సారించింది. సీనియర్ సైంటిస్ట్ మంజులారెడ్డి, పురాన్ సింగ్ సిజ్‌వాలీ బృందం డ్రగ్ డిస్కవరీకి అవసరమైన నూతన టూల్స్ డెవలప్ చేస్తోంది. అధునాతన లక్షిత ఔషధ ఆవిష్కరణ విధానంలో వ్యాధి కారకాలపై నేరుగా పనిచేసి, వాటిని చిన్నాభిన్నం చేసే ఔషధ గుణాలు కలిగిన మందులను కనుగొనేందుకు పరిశోధనలు చేస్తూనే ఉన్నారు. రోగి శరీరంలో వ్యాధి కారకాలు ఏ విధంగా మనుగడ సాగిస్తున్నాయనే విషయాన్ని తెలుసుకుంటూనే, మనుగడ కోసం బ్యాక్టీరియా, వైరస్, ప్రోటోజువా వంటి వ్యాధి కారకాలు ఎలా మార్పు చెందుతున్నాయనే విషయాన్ని పరిశీలిస్తున్నారు. డ్రగ్ ఇచ్చిన సమయంలో ఏ విధంగా ప్రతిస్పందనలు వస్తున్నాయనే విషయాన్ని తెలుసుకుంటున్నారు. ప్రస్తుతం మార్కెట్లో వేల కొలది యాంటీ బయాటిక్స్ వంటి మందులు ఉన్నాయి. కాని, వీటి పనితీరు ఆశించిన స్థాయిలో లేదనే వాదనలున్నాయి. దీంతో అధిక మోతాదులో డ్రగ్ తీసుకుంటే కానీ మందులు పనిచేసే పరిస్థితి లేకుండా పోతుంది. దీంతో మార్కెట్‌లో యాంటీ బయాటిక్స్ వంటి రోగ నిరోధక మందుల వినియోగం పెరుగుతుండగా, వాటి వలన కలిగే ప్రతికూల ప్రభావం కూడా భారీగానే ఉంటుంది. ఇలాంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని సీసీఎంబీ పరిశోధకులు రోగ కారకాలపై నేరుగా పనిచేసే మందుల తయారీపై దృష్టి సారించారు. 2019లో జరిగిన అధ్యయనం ప్రకారం, ప్రపంచ వ్యాప్తంగా యాంటీ బయాటిక్స్ తయారీలో భారత్ ముందంజలో ఉండగా, వీటి వినియోగంలోనూ భారతే అతి పెద్ద వినియోగదారుడిగా ఉంది. ఈ క్రమంలో వ్యాధులకు కారణమైన బ్యాక్టీరియాను హరించడంలో మందులు విఫలమవుతూనే ఉన్నాయని తేలింది. బ్యాక్టీరియా కారణంగా 4.9 మిలియన్ల మంది మృత్యువాత పడినట్లుగా వెల్లడైంది. అంటే, టార్గెటెడ్ డ్రగ్ డిస్కవరీ విధానం భవిష్యత్తులో అత్యంత కీలకంగా మారనుందని సీసీఎంబీ వర్గాలు చెబుతున్నాయి.

దౌర్జన్యాల దానం

దానం వైఖరిపై కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు
విరుద్ధ, వింత పోకడలపై నిప్పులు చెరిగిన కార్పొరేటర్ దేదీప్య

సమావేశంలో మాట్లాడుతున్న వెంగళరావునగర్ కార్పొరేటర్ దేదీప్యా విజయ్

వెంగళరావునగర్, ఏప్రిల్ 23: రౌడీలతో కలిసి వేదికను పంచుకుంటూ సికింద్రాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ భయాందోళనల్ని సృష్టిస్తున్నారని, దానం వైఖరిపై కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసినట్లు వెంగళరావునగర్ బీఆర్ఎస్ కార్పొరేటర్ దేదీప్యా విజయ్ వెల్లడించారు. మధురానగర్‌లోని తమ కార్యాలయంలో ఆమె మంగళవారం విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. దాదాగిరి, దౌర్జన్యాలతో ప్రజాభిమానాన్ని పొందలేరని, మంచి చేసి మాత్రమే ప్రజల్లో అభిమానాన్ని పొందవచ్చని, దీనిని గ్రహించాలని ఆమె సూచించారు. దానం వైఖరిపై దేదీప్య నిప్పులు చెరిగారు. రౌడీ షీటర్ చిన్న శ్రీశైలం యాదవ్‌తో కలిసి ఎన్నికల వేదికపై దానం నాగేందర్ ఎన్నికల ప్రచారాన్ని కొనసాగిస్తూ ఎమ్మెల్యే మాగంటి రౌడీలను పెంచి పోషిస్తున్నారని ఆరోపణలు చేయడం హాస్యాస్పదమని, ప్రజాస్వామ్యంలో రౌడీయిజానికి తావులేదని ఆమె అన్నారు. ఓటర్లను భయపెట్టి బెదిరించి ఓట్లు వేయించుకోవాలని దానం ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. రౌడీయిజాన్ని అణిచివేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని ఆమె అన్నారు. రౌడీలు, గూండాలతో ఎన్నికల ప్రచార వేదికలపై చోటిచ్చే దానం.., మనస్సున్న జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్‌పై విమర్శలు చేస్తున్నారని పేర్కొన్నారు. రూ.5లకు సిగరెట్లు అమ్ముకున్నోడివి అంటూ నాడు దానంపై సీఎం రేవంత్‌రెడ్డి విమర్శలు గుప్పించిన విషయాన్ని ఆమె గుర్తు చేశారు. బతుకమ్మ పండుగ, రంజాన్, క్రిస్మస్‌లకు కుల మతాలకు అతీతంగా ఆడపడుచులకు ప్రేమ ఆప్యాయతలతో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ కానుకలివ్వడం ఆనవాయితీగా వస్తున్నదని, ఆడపడుచులకు రూ.5 డబ్బాలు కానుకలుగా మాగంటి ఇచ్చారంటూ దానం విమర్శలు చేయడం తగదని ఆమె హితవు పలికారు. ఆడపడుచులపై చేసిన వ్యాఖ్యల్ని దానం బేషరతుగా ఉపసంహరించుకుని మహిళా లోకానికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజాక్షేత్రంలో రౌడీలు, గూండాలతో కలిసి ప్రచారాన్ని చేసే కాంగ్రెస్‌కు ఎన్నికల్లో ఓటర్లే తగిన బుద్ధి చెప్తారని ఆమె పేర్కొన్నారు.

రూ. 5 కోట్ల ఆస్తి పన్ను చెల్లించి..

రూ.26 లక్షల రిబేట్ పొందిన యశోద ఆసుపత్రి యాజమాన్యం
ఎర్లీబర్డ్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ పిలుపు



సిటీబ్యూరో, ఏప్రిల్ 23(నమస్తే తెలంగాణ): ఎర్లీబర్డ్ పథకంలో భాగంగా 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నగరంలోని యశోద ఆసుపత్రుల యాజమాన్యం వివిధ ప్రాంతాల్లోని 11 ఆసుపత్రుల ఆస్తిపన్ను రూ.5.38 కోట్లకు గానూ రూ.5.11 కోట్లు చెల్లించి, 5 శాతం రిబేట్ కింద రూ. 26.92 లక్షల రాయితీని పొందారు. ఈ సందర్భంగా ఆస్తిపన్నుకు సంబంధించిన చెక్కులకు యశోద ఆసుపత్రి యాజమాన్యం జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్‌ను కలిసి అందజేశారు. ఎర్లీబర్డ్ పథకం ఈ నెల 30తో ముగియనున్నందున 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఆస్తిపన్నును చెల్లించని వారు ఉంటే పన్ను మొత్తం చెల్లించి ఐదు శాతం రిబేటు పొందాలని కమిషనర్ సూచించారు.

పద్మారావు గౌడ్‌కు టీఏటీయూ మద్దతు

సిటీబ్యూరో, ఏప్రిల్ 23(నమస్తే తెలంగాణ): తెలంగాణ ఆటో మోటార్స్ డ్రైవర్స్ ట్రేడ్ యూనియన్ (టీఏటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు వేముల మారయ్య ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లు సికింద్రాబాద్ పార్లమెంట్ అభ్యర్థి పద్మారావు గౌడ్‌కు మద్దతు ప్రకటించారు. కాంగ్రెస్, బీజేపీల ఓటమి లక్ష్యంగా పనిచేస్తామని హామీ ఇచ్చారు. టకారా బస్తీలోని ఆయన నివాసంలో యూనియన్ నాయకులు పద్మారావు గౌడ్‌ను మంగళవారం కలిశారు. బీఆర్ఎస్ గెలుపు కోసం ఆటో డ్రైవర్లంతా చేస్తున్న ప్రచార కార్యక్రమాలను ఆయనకు వివరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు డి.శ్రీనివాస్, నిరంజన్, పెద్దిరాజు, రాకేష్, కుమార్, ఎల్లయ్య, వెంకటేశ్ తదితరులున్నారు.

ఏజెన్సీ రిజర్వేషన్లపై పార్టీలు స్పష్టత ఇవ్వాలి

జూన్ 20న ఇందిరా పార్క్ వద్ద గిరిజన మహాధర్నా



సమావేశంలో అభివాదం చేస్తున్న రాజేశ్ నాయక్, గిరిజన, ఆదివాసీ సంఘాల నాయకులు

ఖైరతాబాద్, ఏప్రిల్ 23: ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనులకు వంద శాతం రిజర్వేషన్ల కల్పనపై అన్ని పార్టీలు స్పష్టత ఇవ్వాలని నంగారా భేరి లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు గుగులోతు రాజేశ్ నాయక్ డిమాండ్ చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా గిరిజనుల ఓట్లే కీలకంగా ఉంటాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వంద రోజులు దాటినా ఇంకా గిరిజనుల సంక్షేమంపై మాట్లాడటం లేదన్నారు. కనీసం మంత్రివర్గంలోనూ అవకాశం కల్పించలేదన్నారు. తమ ఓట్లతో గెలిచి ఇలాంటి వైఖరిని ప్రదర్శిస్తే బుద్ధి చెబుతామన్నారు. డీఎస్సీ 2024 నోటిఫికేషన్ ప్రకటనలో ఆర్టికల్ 244(1) అనుసరించి ఏజెన్సీ ప్రాంతంలో వంద శాతం ఉద్యోగాలను స్థానిక గిరిజన అభ్యర్థులతోనే భర్తీ చేయాలన్నారు. డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చినా అందులో జనరల్, ఏజెన్సీ వేర్వేరుగా ఇవ్వాలన్నారు. అలాగే, ఐటీడీఏలోని బ్యాక్‌లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే ప్రభుత్వ ట్రైబల్ అడ్వయిజరీ కమిటీని ఏర్పాటు చేసి వంద శాతం గిరిజనులకు రిజర్వేషన్లు కల్పించేందుకు తీర్మానం చేయాలన్నారు. ఈ పార్లమెంట్ ఎన్నికలకు ముందే స్పష్టత ఇవ్వాలని, లేనిపక్షంలో జూన్ 20న ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద గిరిజనుల మహాధర్నా కార్యక్రమం చేపడుతామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఆదివాసీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కొమురం బుచ్చయ్య దొర, ఏజెన్సీ డీఎస్సీ సాధన కమిటీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు జాదవ్ సోమేశ్, తెలంగాణ గోండ్వాన విద్యార్థి సంక్షేమ పరిషత్ రాష్ట్ర కన్వీనర్ ఇర్పా ప్రకాశ్ దొర, మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లా ఏజెన్సీ జేఏసీ జిల్లా అధ్యక్షులు వడిత్యా రాజు నాయక్, లంబాడీ విద్యార్థి సేన వ్యవస్థాపక అధ్యక్షులు భూక్యా కుమార్, వి.రమేశ్, స్వామి రాథోడ్, దీపక్ పాల్గొన్నారు.

హెచ్‌ఎండీఏ ప్లానింగ్‌లో సింగిల్ విండో..

టీఎస్ బీపాస్ ద్వారానే అనుమతులు
నేటి నుంచి అమల్లోకి..: హెచ్‌ఎండీఏ ప్రకటన జారీ

సిటీబ్యూరో, ఏప్రిల్ 23(నమస్తే తెలంగాణ): హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్‌ఎండీఏ) పరిధిలో భవన నిర్మాణ, లే అవుట్ల అనుమతుల కోసం సింగిల్ విండో విధానాన్ని మాత్రమే అమలు చేస్తున్నామని హెచ్‌ఎండీఏ మంగళవారం పేర్కొంది. ఈ నెల 24 నుంచి ఈ విధానం అమల్లోకి వస్తుందని, దీన్ని ప్రజలు గుర్తించాలని సూచించారు. హెచ్‌ఎండీఏలో భవన నిర్మాణ అనుమతుల కోసం 2016 నుంచి డెవలప్‌మెంట్ పర్మిషన్ మేనేజ్‌మెంట్ సిస్టం (డీపీఎంఎస్)ను ప్రారంభించగా, దాని స్థానంలో కొత్తగా టీ ఎస్ బీ పాస్ విధానాన్ని తీసుకువచ్చింది. ఇప్పటి వరకు రెండు పద్ధతుల్లో అనుమతులకు అవకాశం ఉన్నా, ఇక నుంచి కేవలం టీఎస్ బీ పాస్ ద్వారానే ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకునేలా విధానాన్ని అమలు చేస్తున్నామని అధికారులు తెలిపారు. ప్రస్తుతం, హెచ్‌ఎండీఏ పరిధి 7 జిల్లాలు, 70 మండలాలు, 1032 గ్రామాలల్లో విస్తరించి ఉంది. ఇందులో జీహెచ్‌ఎంసీతో పాటు 7 కార్పొరేషన్లు, 30 మునిసిపాలిటీలు, 697 గ్రామాలు ఉన్నాయి. ఇప్పటి వరకు గ్రామ పంచాయతీల్లో భవన నిర్మాణ, లే అవుట్ల అనుమతులు డీపీఎంఎస్ ద్వారా ఇస్తుండగా, ఇక నుంచి హెచ్‌ఎండీఏ పరిధిలోని గ్రామ పంచాయతీల పరిధిలో ఇచ్చే అనుమతులన్నీ 24-04-2024 నుంచి టీఎస్ బీ పాస్ ద్వారా ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని, దానికి అనుగుణంగానే వెబ్‌సైట్ మార్పులు చేసి అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు.

పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులే..

ఇప్పటి వరకు డీపీఎంఎస్ విధానంలో దరఖాస్తు చేసుకున్న వాటికి మాత్రమే పాత విధానంలో అనుమతుల ప్రక్రియ జరుగుతుందని, పాత దరఖాస్తులు మాత్రమే డీపీఎంఎస్ విధానంలో ప్లానింగ్ విభాగం అధికారులు పరిశీలన చేసిన అనుమతులు మంజూరు చేస్తారు. ఈ నెల 24 నుంచి మాత్రం కేవలం టీఎస్ బీ పాస్ వెబ్‌సైట్‌లోనే దరఖాస్తు చేసుకోవాలని, ఈ మార్పును హెచ్‌ఎండీఏ పరిధిలోని ప్రజలు గుర్తించాలని, హెచ్‌ఎండీఏ వెబ్‌సైట్‌లో దీనికి సంబంధించిన లింక్ ఉంటుందని తెలిపారు. కాగా, చేంజ్ ఆఫ్ ల్యాండ్ యూజ్ (సీఎల్‌యూ) దరఖాస్తులు మాత్రమే డీపీఎంఎస్ విధానంలో అనుమతిస్తామని తెలిపారు.

ఓటుపై చైతన్యం పెంచే దిశగా అవగాహన

సిటీబ్యూరో, ఏప్రిల్ 23(నమస్తే తెలంగాణ): స్వీప్ కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్ జిల్లాలో ఓటింగ్ శాతం పెంచే దిశగా పెద్ద ఎత్తున ర్యాలీలు, సమావేశాలు ఏర్పాటు చేసి ఓటు ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. ప్రధానంగా చిరు వ్యాపారులు, స్వయం సహాయక మహిళా సంఘాల సమావేశం, బీఎల్ఓ, బీఎల్ఓ సూపర్‌వైజర్లు కూడా ఓటరు అవగాహన కార్యక్రమంలో పాల్గొని చైతన్య కార్యక్రమాలు చేపట్టారు. 'ఓటు ఫర్ ష్యూర్' నినాదాలతో అవగాహన కల్పిస్తున్నారు. ఓటు హక్కు ప్రాధాన్యత, ప్రజాస్వామ్యంలో ఓటు విలువ గురించి ర్యాలీలో నినాదాలు చేస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఓటింగ్ శాతం పెంచే దిశగా మహిళా సంఘాలు, బీఎల్ఏలు, సూపర్ వైజర్లు విశేష కృషి చేస్తున్నా రు. జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు అర్బన్ కమ్యూనిటీ విభాగం ఆధ్వర్యంలో చిరు వ్యాపారులకు, మార్కెట్, పలు విద్యా సంస్థల్లో, వ్యాపార కూడలిలో పెద్ద ఎత్తున ర్యాలీలు, సమావేశాలు నిర్వహించి ఓటర్లకు అవగాహన కల్పిస్తూ ఓటింగ్ పెంచేందుకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. క్షేత్ర స్థాయిలో స్వయం సహాయక సంఘాల మహిళలు, బీఎల్ఓలు, సూపర్‌వైజర్లు, యూసీడీ అధికారులు, సిబ్బంది అందరూ కలిసికట్టుగా చైతన్య కార్యక్రమాలు చేపడుతున్నారు.

తెలంగాణ పౌల్ట్రీ బ్రీడర్స్ అసోసియేషన్ సభ్యులతో సమావేశమైన అధ్యక్షుడు రాఘవరావు

కోళ్ళ, పాడి పరిశ్రమ వృద్ధికి కృషి

తెలంగాణ పౌల్ట్రీ బ్రీడర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డి.రాఘవరావు

మాదాపూర్, ఏప్రిల్ 23: కోళ్ళ పరిశ్రమ ఉమ్మడి రాష్ట్రంతో పోల్చిచూస్తే దేశంలోనే ప్రథమ స్థానంలో ఉండేదని, కోళ్ళ పరిశ్రమ ప్రధానమైన అనుబంధ కార్యకలాపంగా నడిచేదని తెలంగాణ పౌల్ట్రీ బ్రీడర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డి. రాఘవరావు అన్నారు. మాదాపూర్‌లోని మినర్వా గ్రాండ్‌లో తెలంగాణ పౌల్ట్రీ బ్రీడర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి తెలంగాణ పౌల్ట్రీ బ్రీడర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డి.రాఘవరావు విచ్చేసి అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు ఎం.దామోదర్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ జి.రమేష్ బాబు, వైస్ ప్రెసిడెంట్ వి.మధుసుదన్, తెలంగాణ పౌల్ట్రీ బ్రీడర్స్ ఫెడరేషన్ జనరల్ సెక్రటరీ వి.భాస్కర్‌రావు, బీసీసీ బాలసుబ్రమహణ్యన్‌తో కలిసి మంగళవారం జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ, కోళ్ళ ఉత్పత్తి రంగం, పరిశ్రమ గ్రామీణ యథార్థ స్థితిని ప్రతిబింబిస్తుందని అన్నారు. స్థానికంగా కోళ్ల పరిశ్రమ, పాడి పరిశ్రమతో పాటుగా గ్రామీణ ఆదాయం వృద్ధికి తోడ్పడుతుందన్నారు.